యమకూపం?

శశిభూషణ్

చీకటి పడింది.

ఆదెమ్మ ఇంట్లో కోలాహలం పెరుగుతూంది క్షణ క్షణానికీ. క్రింద భాగంలోని గదుల్లో గాజులు గలగలలు, పకపకలు ఆగిఆగి విన్పిస్తున్నాయి. ఆదెమ్మ హడావుడిగా తిరుగుతోంది.

వీధిలో ఊరకుక్క అటూయిటూ పరుగులు తీస్తూ కర్ణకఠోరంగా మొరుగుతూంది.

చీకట్లు బాగా ముసురుకున్నాయి.

ఆదెమ్మ ఇంటిముందు ఓ సైకిల్ రిక్షా ఆగింది. దానిలోంచి లాల్చీ, పైజామా ధరించిన యువకుడు క్రిందకు దిగాడు. అతని చేతివ్రేళ్ళ మధ్య చార్మినార్ సిగరెట్ పొగలు

గక్కుతోంది. మీసాలు, గడ్డం లేవు. సన్నగా గీసుకున్నాడు. జుట్టు భుజాలమీద పడుతోంది. భారీ విగ్రహం చూడటానికి కళాకారునిలా కన్పిస్తున్నాడు.

ఊరుపక్క మొరుగుతూ రిక్షావైపు వచ్చింది. రిక్షాకి కాస్త దూరంగా నిల్చుని, కాసేపు మొరిగి, వెనుదిరిగింది. క్షణాలమీద దాని ఆకారం చీకట్లో అదృశ్యమైంది.

ఆ వీధిపేరు గాలి గోపురం వీధి. కాని, వీధిలో ఎక్కడా గుడిగాని, గోపురంకాని కన్పించవు. ఆ పేరు ఎప్పుడు ఎలా వచ్చిందో ఆ ఊర్లో ఎవ్వరికీ తెలియదు.

రిక్షానుండి దిగిన కళాకారుడు రిక్షావాలాకి చిల్లర యిచ్చి, ఆదెమ్మ ఇంట్లోకి ప్రవేశించాడు బిడియపడకుండా.

ఆదెమ్మ ఇంటికొచ్చే మగవాళ్ళందరూ అంతే! ఏమాత్రం బెరుకులేకుండా అత్తవారింట్లోకి వెళ్తున్నట్టే వెళ్తారు.

“రండి బాబూ...రండి...క్రొత్త ముఖంలా వుందే? మందేవూరు బాబూ? ఇటువైపు ఎప్పుడైనా వచ్చారా?” కళాకారుణ్ణి వాల్లోనే కల్సుకుని, స్వాగతం పలికి, మంచి చెడ్డలు విచారించటం ప్రారంభించింది ఆదెమ్మ.

అతను చిన్నగా నవ్వాడు. సిగరెట్ క్రిందపడేసి కాలితో తొక్కి ఆర్పేశాడు. “నాది ఈ ఊరు కాదండి. ఈ జిల్లాకూడా కాదు. కోర్టుపనిమీద వచ్చాను. ఆ పని అయిపోయింది. రేపు ఊరెళ్ళాలి! అందుకని...” మళ్ళీ నవ్వాడు.

ఆదెమ్మకూడా అతని నవ్వులో పాలుపంచుకుంది. “సంతోషం నాయనా! రాత్రంతా ఇక్కడ వుంటావా?”

“ఇక్కడ నాకిష్టం లేదండీ! ట్రావెలర్స్ బంగ్లాలో గది తీసుకున్నాను...”

అతని మాటలు పూర్తి కాకమునుపే సర్వం తెలిసిన యోగినిలా గంభీరంగా తల పంకించింది ఆదెమ్మ. “అగదిలో కెళ్ళి కూర్చో బాబూ!” చేత్తో ఓ గదివైపు చూపించింది.

కళాకారుడు ఆదెమ్మ చూపించిన గదిలోకి నడిచాడు. పట్టెమంచం పరమఛండాలంగా వుంది. అయినా అతను అసహ్యించుకోలేదు. ఆ మంచంమీదే కూర్చున్నాడు.

కళాకారుడు చాలా విషయాలకు అతీతుడు.

గుమ్మంలో అడుగుల చప్పుడైంది. చవకరకం సెంటు వాసన, గాజులు గలగలలు ... అతను గుమ్మంవైపు చూశాడు.

ఆదెమ్మ లోనికొచ్చింది.

‘డర్టీ బిచ్ ...దీనికి కూడా సెంటు కావల్సివచ్చింది’ అతను గొణుక్కున్నాడు.

అరగంటకోసారి సెంటు రాసుకుంటుంది ఆదెమ్మ. లేకుంటే ఆమె మనసు మనసులోవుండదు.

కళాకారుడు బలవంతంగా నవ్వి ఆదెమ్మ ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

“మరేం లేదు బాబూ...తమకు తెలియంది ఏముంది? వస్తువుల రేట్లన్నీ పెరిగిపోయాయి. జాకెట్ ముక్క కావాలన్నా పది రూపాయలు పొయ్యాల్సి వస్తోంది... అందుకని...”

“మీరూ రేట్లు పెంచారా?”

“అంతే బాబూ!” అనవసరంగా నవ్వింది ఆదెమ్మ.

విసుక్కున్నాడు కళాకారుడు. “నైట్ బుక్కింగ్‌కి ఎంత ఇవ్వాలో చెప్పు.”

"తమకు తెలియనిది ఏముంది బాబూ! అరవై రూపాయలు..."

వందరూపాయల నోటు ఆదెమ్మ కిచ్చాడతను. "రసగుల్లాలా వుండాలి!"

"నావద్ద రసగుల్లాలు లేవు బాబూ! అన్నీ లడ్డూలే!" నవ్వుతూ నోటును బొడ్లో దోపుకుంది ఆదెమ్మ. "తమ పేరేమిటి బాబూ?"

"రామ్మూర్తి."

గదిలోంచి వెళ్ళిపోయింది ఆదెమ్మ.

2

గాలిగోపురం వీధిలోకి ఆదెమ్మ ఇంట్లోనే ఓ గది అది.

గది గోడలు అనేక రకాల రంగుల మరకలతో కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయ్. నేలమీద కార్పెట్ లేదు' అంగుళం మందంతో దుమ్ము పేరుకుపోయి, కార్పెట్ అవసరం లేకుండా చేస్తోంది. మూడుకాళ్ళ టేబిల్ ఒక మూలగావుంది. దానిముందు విరిగిపోవటానికి తయారుగా వున్న కుర్చీ.

ఒక ప్రక్కగా కృతయుగానికి చెందిన పట్టె మంచం వుంది. ఆ మంచంమీద త్రేతాయుగానికి సంబంధించిన పరుపు, దానిమీద ద్వాపరయుగానికి చెందిన తలగడ వున్నాయ్.

మంచంమీద కలియుగానికి చెందిన సీత బాధ పడుతోంది. ఆమెను బాధపెడుతున్న వ్యక్తికూడా కలియుగానికి సంబంధించినవాడే. ఆదెమ్మ తమ్ముడు. పేరు ధనపతి.

భర్తలేని ఆదెమ్మ నిండు ముత్తయిదువులా జీవిస్తోంది.

ఆ ఇంటికి సర్వాధికారిణి ఆమే! బయటి వ్యవహారాలు ఆమె తమ్ముడు ధనపతి చూస్తుంటాడు.

ధనపతి బ్రాందీ తాగివున్నాడని తెలిస్తే...అటువంటి సమయాల్లో తమ్ముణ్ని ఎక్కువగా మాట్లాడించదు ఆదెమ్మ.

గంటక్రితం ఓ ఇంగ్లీష్ చిత్రం చూసి ఇంటికొచ్చాడు ధనపతి. మేట్నీ చూస్తున్నప్పుడే అనుకున్నాడతను... ఇంటికి వెళ్ళిన వెంటనే సీతని బాధపెట్టి, తను సుఖపడాలని.

మేట్నీనుంచి వస్తూ దారిలో XXX రమ్ ఒక బాటిల్ పుచ్చుకున్నాడు. అక్కడే ఇంకో రెండు పెగ్గులు బ్రాందీ పోసుకున్నాడు గొంతులో. ఇంటికొచ్చి, కడుపులోని ఖాళీని కాపుసారాతో నింపుకుని, సీత గదిలోకి ప్రవేశించాడు.

ధనపతిని చూసిన ప్రతిసారీ పెద్దపులిని చూసినట్టుగా వణికిపోతుంటుంది సీత. అతనంటే ఎంత భయమో అంతే అసహ్యంకూడా వుందామెకు. అయినా; ఏనాడూ అతన్ని తిరస్కరించలేదు. తిరస్కరిస్తే బెల్టు దెబ్బలతో వీపు అట్టలు లేచిపోతుంది.

ఒకటి రెండుసార్లు బెల్టు దెబ్బలు తినివున్నది సీత—ధనపతిని తిరస్కరించి. చాలా తొందరగా ఆమెకు బెల్టు దెబ్బలు తినటంకంటే ధనపతిని భరించటమే సులభమని అరమైంది.

''సీతా! నా దృష్టిలో నువ్వు మాత్రమే ఆడదానివి'' గదిలోంచి వెళ్ళడానికి సిద్ధమవుతున్నాడు ధనపతి. అతని ముఖంలోంచి అలసట, తృప్తి కల్సిపోయి బయటికి తొంగి చూస్తున్నాయ్.

"సీతా!" తిరిగి పిలిచాడు సిగరెట్ వెలిగించుకుని.

"ఊఁ!" నీరసంగా మూలిగింది సీత. మంచంమీద వెల్లకిలా పడివుందామె. ఒంటిమీద దుస్తులు లేవు. కురులు ముఖంమీద కదులుతున్నాయ్. బొట్టు చెమటతో కల్సి ముక్కుమీదకు జారుతోంది. బుగ్గలనిండా గాట్లు! పెదవులు నెమ్మదిగా ఒణుకుతున్నాయ్.

సీత అవతారాన్ని చూసిన ధనపతి తృప్తిగా నవ్వుకున్నాడు. "డార్లింగ్! రెస్ట్ తీసుకో!"

ముఖంమీద కదులుతున్న వెంట్రుకల్ని చేత్తో వెనక్కినెట్టుకుంది సీత. ధనపతి గుమ్మం దాటేవరకు వూరుకుని, ఆటు తర్వాత నేలమీద వుమ్మేసింది. లేచికూర్చునే ఓపిక లేనట్టు ప్రక్కకు ఒత్తిగిలి పడుకుంటూ కళ్ళు మూసుకుంది.

బిగ్గరగా ఏడవాలన్పిస్తోందామెకు. అయినా ఏడవలేదు. అప్పటికే చాలాసార్లు ఏడ్చివున్నది. ఆఖరు కన్నీరుబొట్టును కూడా రాల్చేసిందెప్పుడో. ఇహమీదట ఏడిస్తే కళ్ళలోంచి వేడినీళ్లు కాకుండా నెత్తురు కారుతుందేమోనని ఆమె భయం!

"సీతా...ఏయ్ సీతా... చచ్చావా? బ్రతికేవున్నావా?" అరుస్తూ లోనికొచ్చింది ఆదెమ్మ.

లేనిశక్తి తెచ్చుకుని మంచందిగి నిల్చుంది సీత.

"ఏమిటే ఈ అవతారం?" ఆశ్చర్యం ప్రదర్శించింది ఆదెమ్మ.

"మీ తమ్ముడు..." నీళ్ళు నమిలింది సీత.

"సర్లే! వెళ్ళి త్వరగా స్నానం చేసి తగలడు. మంచి బేరం వచ్చింది. చప్పున వెళ్ళిరా!"

నిట్టూర్చి గదిలోంచి వెలుపలికొచ్చి, బాత్రూంవైపు

వెళ్ళింది సీత—తన్ను ఆడదానిగా పుట్టించిన భగవంతుణ్ణి కసిదీరా తిట్టుకుంటూ.

3

కిటికీవద్ద నిల్చుని చీకట్లోకి చూస్తోంది సీత. ట్రావెలర్స్ బంగ్లా చుట్టూ కాటుకలాంటి చీకటి పేరుకొనుంది. దూరంగా స్మశానం!

సీత ట్రావెలర్స్ బంగ్లాలోకి అడుగు పెట్టడం ఇది మొదటిసారి కాదు. ఆ బంగ్లాలో ఎన్ని గదులున్నాయో ఆమెకు బాగా తెలుసు. బంగ్లాకు దూరంగా స్మశానం వుందని కూడా తెల్సు ఆమెకు. కొన్నేళ్ళుగా భయంకర మైన ఊబిలో కూరుకుపోయి జీవచ్ఛవంలా బ్రతుకుతోం దామె. ఆమెకు తెలియనిది ఒక్కటే.

ఈ ఊబిలోంచి ఎలా బయట పడటం?

ఆ ప్రశ్న కొన్నేళ్ళుగా బాధిస్తోంది సీతని. సమాధానం చిక్కని ప్రశ్న...భయంకరమైన ప్రశ్న.

ఆదెమ్మ ఇంట్లోంచి పారిపోవటానికి సీతకి ఇంతవరకు అవకాశం రాలేదు. అవకాశం వచ్చినప్పుడు పారిపోవాలని ప్రయత్నించలేదు సీత. ఆమె తెల్సుకుంటే ఆదెమ్మ ఇంటిని ఆదెమ్మను వదిలి పారిపోవటం పెద్ద సమస్యకాదు. ఎక్కడికి పారిపోవాలి? పారిపోయి ఏం చేయాలి? తిరిగి యిదే బ్రతుకు మరొకచోట బ్రతికటం కంటే ఆదెమ్మ కొంప లోనే పడివుండటం నయం కాదా?

అన్నీ సమస్యలే సీతకు. మనుషుల మీద ఆమెకు నమ్మకంపోయి చాలా రోజులైంది. ఇప్పుడిప్పుడే దేవుడి మీదకూడా నమ్మకం పోతోందామెకు.

"సీతా!"

యంత్రంలా వెనుదిరిగింది సీత.

ఎదురుగా మంచంమీద రామ్మూర్తి కూర్చునున్నాడు. హోటల్ నుంచి వాచ్‌మన్ తీసుకొచ్చిన కారియర్ ఒక ప్రక్కగా నున్న బల్లమీదుంది.

"ఆకలి వెయ్యటం లేదా?" రామ్మూర్తి అడిగాడు.

"మీరు భోంచెయ్యండి."

"నీ సంగతి?"

"వద్దు."

"సీతా! నా పేరు రామ్మూర్తి" అన్నాడతను సిగరెట్ తీసి వెలిగించుకుంటూ.

సీత పేలవంగా నవ్వి, మంచంమీద అతని ప్రక్కనే కూర్చుంది.

"మీ పేరు నేనడగలేదు. రేపు నే నెవరైనదీ మీకు గుర్తుండదు. మీరూ నాకంతే! ఉదయం ఐదింటివరకు మనం దంపతులం ... ఆత్మీయులం ... స్నేహితులం..." మళ్ళీ నవ్విందామె. "మొదట భోంచెయ్యండి మీరు."

"నిన్ను వదలి నేనెలా భోంచెయ్యగలను సీతా?"

వినకూడని మాటలు విన్నట్టు ముఖం చిట్లించింది సీత.

రామ్మూర్తి తుదకు సీత చేతినైనా ముట్టుకోలేదు. "సీతా! నువ్వు అడగక పోయినా నా వివరాలు నీకు చెప్పటం నా విధి. నా పేరు నీకు యిదివరకే చెప్పాను. ఇహ పోతే నా వృత్తి. క్రైం రచయితను. పెద్దలు వదిలి వెళ్ళిన ఆస్తి బోలెడు వుండటంతో; సంపాదించాల్సిన అవసరం లేకపోవటంతో కాలం గడవటానికి రచనలు చేస్తున్నాను. ఆ విధంగా కూడా కొంత డబ్బు చేరుతూనే వుంది. నా స్నేహితులందరూ నన్ను 'విచిత్రమైన వ్యక్తి' అంటుంటారు.

అది పూర్తిగా అబద్ధం కాదేమో!

నా చేష్టలు ఒక్కోసారి నాకే విచిత్రంగా తోస్తాయి. సమాజంలోని కుళ్ళునంతా ఒక్కసారిగా కడిగెయ్యాలన్నంత ఆవేశం నాలోవుంది. కాని, అది ఒక్కడివల్ల అయ్యే పనికాదు.

సీతా! నీవలన నాకెటువంటి అనుభవమూ అవసరంలేదు. నీకిష్టమైతే నేనడిగే కొన్ని ప్రశ్నలకు సమాధానాలివ్వు చాలు...'' క్రొత్త సిగరెట్ వెలిగించుకున్నాడు రామ్మూర్తి.

వింతవ్యక్తి తనకు జీవితంలో మొట్టమొదటిసారిగా తారసిల్లాడని అర్థమౌతోంది సీతకు.

''ఏం సీతా? నా ప్రశ్నలకు బదులిస్తావా?''

రామ్మూర్తి కంఠం తిరిగి విన్పించేసరికి ఈ లోకంలోకి వచ్చింది సీత.

''అడగండి'' అంది__ ఇంకేమనాలో తెలియక.

''నీకు ఈ జీవితం బావుందా?''

''విషం తాగిన మనిషిని 'బాగుందా?' అని ప్రశ్నిస్తే ఏం సమాధానం చెప్పగలదు?''

''నా ప్రశ్నకు నీ ప్రశ్నే సమాధానమా?''

అవునన్నట్లు తలూపిందామె.

''నువ్వు ఈ ఊబిలో ఎలా ఇరుక్కున్నావ్? అభ్యంతరం లేకపోతే నీ కథ క్లుప్తంగా విన్పించు సీతా!''

రామ్మూర్తిని చూడటం అదే మొదటిసారి అయినా; అతని రచనలు బోలెడు చదివివున్నది సీత. ప్రముఖ కొంత నవలా రచయితగా రామ్మూర్తికి ఆంధ్రదేశమంతటా మంచి పేరుంది.

కథా వస్తువును ఎన్నుకోవడం దగ్గర్నుంచి నవల ముగింపు వరకు తన ప్రత్యేకతను ప్రదర్శిస్తుంటాడు రామ్మూర్తి. కల్పితాలు అతను వ్రాసింది బహు తక్కువ. యధార్థ గాథల్ని ఎక్కువగా నవలలుగా మలుస్తుంటాడు. అతను మంచి రచయితగా పదిమంది చేత గుర్తింపబడ టానికి ఇదికూడా ఒక కారణం అయివుండాలి!

"మూర్తిగారూ! మీరచనలు చాలా చదివాను నేను" మంచం మీద మరికాస్త జరిగి కూర్చొంది సీత. "మీతో పరిచయం ఈ విధంగా కలుగుతుందని నేనెప్పుడూ వూహించనైనా లేదు..." మాటలు ఆపేసి తల దించు కుందామె.

"నా కథ మీరు వినలేరు మూర్తిగారూ! నా కథే కాదు...నావంటి వారందరి కథలూ ఒకే విధంగా వుంటాయి. ఇంకా చెప్పాలంటే ఆడవాళ్ళ కథలన్నీ ఒకేవిధంగా వుంటాయి."

"అంటే?" రామ్మూర్తి నొసలు ముడతలు పడింది.

తలెత్తింది సీత. "ఏముందీ? మనుషుల్ని దేవుడు ఆడి స్తుంటే ఆడవాళ్ళని మగవాళ్ళు ఆడిస్తూ ఆనందిస్తున్నారు. అంతే! ఈ విషయంలో స్త్రీలందరూ ఇంచుమించు ఒకే విధమైన బాధని ఎదుర్కొంటున్నారు."

"ఈ భూమ్మీద సుఖంగా వున్న ఆడవాళ్ళే లేరనా నీ వుద్దేశ్యం?"

"ఎంతమంది ఆడవాళ్ళు సుఖంగా వున్నారో చెప్ప లేను గాని, సుఖంగా వున్నట్టు నటించే స్త్రీల గురించి మాత్రం చెప్పగలను. అలాంటివాళ్లు మనకు ఎక్కడ చూసినా కన్పిస్తారు."

"నీ మాటల్లో పూర్తిగా కాకపోయినా ఎంతోకొంత నిజం లేకపోలేదు" సిగరెట్ బట్ ని గది మూలకు విసిరాడు రామ్మూర్తి. "నీ కథ వినటానికి ఇష్టపడుతున్నాను. సీతా!"

నిర్లక్ష్యంగా నవ్విందామె.

"మామూలే! ప్రేమించిన వాడి మాటలు నమ్మి, కన్న తల్లిదండ్రుల్ని వదిలి గడప దాటాను. అతని మోజు తీర్చుకున్నాడు. అలాంటి వాళ్ళందరూ చెప్పకుండా పారిపోయే విధంగా కాకుండా ఇతను ఆఖరున నా కొక ఉపకారం చేసి వెళ్ళాడు. ఎన్నటికీ మరువలేని మహోపకారం... మోజు తీర్చుకుని తనదారిన తాను వెళ్ళలేక; నన్నొక వేశ్యా గృహంలో అమ్మేసి వెళ్ళిపోయాడు... వెయ్యి రూపాయలకు. అప్పటినుంచీ మార్పులేని యాంత్రిక జీవితం జీవిస్తున్నాను."

"ఈ దేశంలో ఒక స్త్రీ ఖరీదు వెయ్యిరూపాయలేనా?" అస్పష్టంగా గొణిగాడు రామ్మూర్తి.

"మూర్తిగారూ! ఒక రచయితగా మీరు బాధపడొచ్చు! కాని, అది నా కిష్టంలేదు. దయచేసి నేను చెప్పింది మర్చిపొండి..." కళ్ళు వర్షించటానికి సిద్ధపడే సరికి చటుక్కున తల తిప్పేసుకుంది సీత.

రామ్మూర్తి ఒక నిశ్చయానికి వచ్చిన వాడిలా తల పంకించాడు. "సీతా! నువ్వు రేపటినుంచి క్రొత్త జీవితం ప్రారంభించబోతున్నావ్!"

"మీరు...ఏమిటి మీరంటున్నది?"

"గాబరా చెందకు" మందహాసం చేశాడు రామ్మూర్తి. "నిన్ను వివాహం చేసుకుంటానని నేను చెప్పటంలేదు.

నాకు పెళ్ళి అయివున్నది. ఆమె పేరు జానకి. ఇంకా పిల్లాజల్లా కలగలేదు. సీతా! భగవంతుడు నాకు అన్నీ ఇచ్చాడు గాని, ఎందుకో మనశ్శాంతిని ఇవ్వలేదు. ఆ లోటు నీద్వారా తీర్చుకోవాలనుకుంటున్నాను. నా కోరిక కోరికగానే మిగిలిపోయేలా చెయ్యొద్దు, చెల్లాయ్."

ఏం మాట్లాడాలో తోచలేదు సీతకి: "మూర్తిగారూ! మీరు...మీరు ఎటువంటి నిశ్చయానికి వచ్చారో..."

"చెబుతాను వినమ్మా!" బుగ్గలమీదకు జారబోయిన కన్నీళ్ళను తుడిచేసుకున్నాడు రామ్మూర్తి. "తిరిగి నిన్ను ఆ దెమ్మ ఇంటికి పంపలేను. రేపటినుంచి నువ్వు నా కజిన్ సిస్టర్‌గా ఈ సమాజానికి పరిచయం చెయ్యబడతావు."

సీత కళ్ళలోంచి జలజల రాలాయి కన్నీళ్ళు. అవి ఆనందబాష్పాలని ఆమెకే తెలియదు.

"మూర్తిగారూ...అన్నయ్యా! ఈ చరిత్రహీనురాలి మీద మీ కెందుకింత శ్రద్ధ?" వణికే కంఠంతో అడిగింది!

"శ్రద్ధకాదమ్మా! బాధ్యత..." రామ్మూర్తి నెమ్మదిగా చెప్పుకుపోతున్నాడు. "ఆ దెమ్మ ఇంట్లో నిన్ను చూసేవరకు నేను అందరిలాంటి మగ వెధవనే!

నిన్ను చూడగానే నా గుండె పగిలింది.

సీతా! కథల్లోలాగే నిత్య జీవితంలో సైతం ఒక్కొక్కసారి విచిత్రమైన సంఘటనలు ఎదురవుతుంటాయి. అందుకు నిదర్శనం మన కలయికే!

ప్రియుని వెంట లేచిపోయి, చివరికి బజారు మనిషిగా మారిన నా చెల్లెలు...నిన్ను చూస్తుంటే దాన్ని చూస్తున్నట్టే వుందమ్మా! ముఖ కవళికల్లో మీ ఇద్దరికీ పెద్దగా తేడాలేదు. అసలు ఎటువంటి తేడాలేదనే చెప్పొచ్చు!

మనిషిని పోలిన మనుషులు వుంటారని ఇప్పుడు నమ్ము తున్నానమ్మా!"

రామ్మూర్తి హృదయాంతరాళాల్లో అగ్నిపర్వతాలు ప్రేలుతుంటాయని వూహించుకుంది సీత. "మీ చెల్లెలు... ఆమె పేరేమిటి?" అడగకూడదనుకుంటూనే అడిగింది.

"సీత."

నెత్తిన పిడుగు పడ్డట్టు క్షణకాలం చలించిపోయింది సీత. నెమ్మదిగా తెప్పరిల్లి నిర్లిప్తంగా నవ్వింది. "సీత ఇప్పుడు..."

"స్వర్గంలో వుందమ్మా!" ముఖంమీద ఏర్పడిన స్వేదం తుడుచుకున్నాడు రామ్మూర్తి. "నీలాగే అదీ వంచించ బడింది. వాడొక రోగ్. ముస్లిమ్. మతాంతర వివాహం కావటంతో సీతని అతనికిచ్చి పెళ్ళి చేయలేకపోయాను.

నా నిర్ణయం తెలిసిన రాత్రే సీత-అతనివెంట లేచి పోయింది. ఆటుతర్వాత నేను అనుభవించిన క్షోభ... ఆ బాధ శత్రువుకి కూడా వద్దమ్మా!

రెండేళ్ళ తర్వాత సీత ఆచూకీ తెల్సింది. రాజమండ్రి లోని ఒక వేశ్యా గృహంలో సీత వుందని తెల్సి వెళ్ళాను. నేను విన్నది నిజమే. ఆ ఇంట్లో సీత కన్పించింది. కాని..." ఆగాడు-బరువుగా వూపిరి పీల్చి వదిలాడు-నాలుకతో పెద వులు తడుపుకున్నాడు.

"కాని?" దడదడలాడే గుండెలతో ప్రశ్నించింది సీత.

"నన్ను చూడగానే తృళ్ళిపడింది. నేను దగ్గరకు వెళ్ళేలోగా మేడమీదనుంచి క్రిందకు దూకేసింది. చేయి విరిగి తల పగిలిన సీతని... నా చెల్లెల్ని హాస్పిటల్‌కి చేర్చాను. ప్రయోజనం లేకపోయింది. డాక్టర్ల శ్రమకి

ఫలితం లేకుండాపోయింది, సీతని ఇంటికి తీసుకురావాలని వెళ్ళి దాని శవాన్ని తెచ్చుకున్నాను."

వెక్కి వెక్కి ఏడుస్తోంది సీత. దుఃఖాన్ని చాలా సేపట్నుంచి బలవంతంగా ఆపుకోవటంతో వెక్కిళ్లు తన్నుకొచ్చాయ్ ఒక్కసారిగా.

"ఏడవకు సీతా!" ఆమె బుగ్గలు, కళ్ళు తుడిచాడు రామ్మూర్తి. "మనిషి జీవితం విచిత్రమైనది. లేకుంటే నువ్వు నాకు పరిచయం అయివుండేదానివి కాదు. ఇప్పుడు చెప్పమ్మా! నాతో కల్సి భోంచెయ్యవూ?"

గబగబ పైటతో కళ్ళు తుడుచుకుంది సీత. "భోంచేస్తాను. ఇకామీదట నువ్వు ఏంచెప్పినా చేస్తానన్నయ్యా!" అంది చిన్నపిల్లలా.

"వెరీగుడ్! నేను చెప్పిందంతా మర్చిపో! నీ గత జీవితాన్నికూడా" స్వయంగా తనే ఇద్దరికీ వడ్డించాడు రామ్మూర్తి.

ఆ రోజు కడుపునిండా తినగల్గింది సీత.

"చెల్లాయ్! ఉదయం ఐదింటికి ఇక్కడికి ఆదెమ్మ తమ్ముడు ధనపతి వస్తానన్నాడు. ఆ రాస్కెల్ రాక మునుపే మనం వెళ్ళాలి! పడుకొని నిద్రపో...ఇదిగో ఈ పాలు తాగేసి పడుకో" ఫ్లాస్కులోని పాలు రెండు గ్లాసుల్లో పోసి, ఒక గ్లాసు సీతకిచ్చాడు రామ్మూర్తి.

గాల్లో తేలిపోతున్నంత హుషారుగా వుంది సీతకి. నులివెచ్చని పాలు గటగట తాగేసింది.

వాచ్‌మేన్‌ని పిలిచి, ఖాళీ ప్లేట్లు, కారియర్, గ్లాసులు ఇచ్చి పంపేశాడు రామ్మూర్తి. పంపేస్తూ అతని చేతిలో ఐదు రూపాయల నోటు పడేశాడు.

పక్క మీద వాలిన సీతని నిద్రాదేవి చాలా తొందరగా కరుణించింది ఆవేళ.

4

గోడగడియారం ఎక్కడో "ఠంగ్...ఠంగ్..." మంటూ వరుసగా గంటలు కొడుతోంది. ఆ శబ్దం నిద్రిస్తున్న సీత చెవుల్ని సోకింది.

కళ్ళు తెరవబోయి మానేసింది సీత. కనురెప్పలమీద ఏదో బరువు వున్నట్టుగా అన్పిస్తోంది. తలమీద ఎవరో సుత్తులతో బాదుతున్నట్టుగా బాధ!

కళ్ళు మూసుకుని అలాగే కాసేపు పడుకుని వుండిపోయింది సీత. ఏదో నీరసం ఆమెను క్రుంగదీస్తోంది.

ఏమిటి...ఏమైంది తనకు? కళ్ళు మూసుకునే ఆలోచిస్తోందామె. ధనపతి... అవును... ఇపుడు గుర్తొస్తోంది. చీకటి పడుతుండగా ధనపతి వచ్చాడు తన గదికి. తాగుబోతు వెధవ! ఆ రాస్కెల్ నిర్వాకమే ఇదంతా! అందుకే ఒళ్ళంతా పచ్చిపుండులా అన్పిస్తోంది. టైం ఎంత అయ్యిందో...? ఇలాగే పడుకునివుంటే ఆదెమ్మ వచ్చి చూస్తే...?

హఠాత్తుగా రామ్మూర్తి గుర్తొచ్చాడు సీతకి. మరికొన్ని సంఘటనలుకూడా గుర్తొచ్చాయి. రామ్మూర్తి...అన్నయ్య ఇంకా నిద్రపోతున్నాడా? చటుక్కున లేచి కూర్చుందామె. వెంటనే ఆశ్చర్యపోయింది. అది ట్రావెలర్స్ బంగ్లాలోని గదికాదు.

ఇంకా నీరసంగానే వుండటంతో మంచం దిగే ప్రయత్నం చెయ్యలేదు సీత. గదిలోని ఫర్నీచర్ని, గోడల్ని మార్చి మార్చి చూసింది కాసేపు. తను వున్నది ట్రావెలర్స్

బంగ్లాలో కాదని ఆమెకు అర్థమైపోయింది చాలా తొందరగా.

ట్రావెలర్స్ బంగ్లాలోని ప్రతిగదిలోనూ సీలింగ్ ఫాన్ వుంది. ఈ గదికి అటువంటిదేం లేదు. చివరికి కిటికీకూడా లేదు. ఉన్న ఒకే ఒక్క ద్వారాన్ని చెక్కతలుపు మూసేసింది. ఆ తలుపుకి పావలా, పదిపైసలు వగైరా నాణేల్ని గుర్తుకు తెప్పిస్తూ కొన్ని కన్నాలున్నాయ్.

తలుపుకి ఆ విధంగా కన్నాలు ఎటువంటి కొంపల్లో వుంటాయో సీతకి తెల్సు.

మంచం దిగబోయింది సీత_అదిరే గుండెల్ని అదుపులో పెట్టుకుంటూ. ఇంతలో తలుపు తెర్చుకుంది. నాలుగు పదులు దాటిన ప్రౌఢ లోనికొచ్చింది.

సీత మంచం దిగే ప్రయత్నం విరమించుకుని, లోనికొచ్చిన ప్రౌఢని చూసింది. ఆదెమ్మకు ఈ ప్రౌఢకు అట్టే తేడాలేదు.

"అమ్మాయ్! లేచి స్నానం చెయ్. పది గంటలు కావస్తోంది" ప్రౌఢ సీతని పట్టిపట్టి చూస్తూ చెప్పింది.

"నేను... నే నెక్కడున్నాను?" నీరసంగా అడిగింది సీత.

"నా ఇంట్లో."

"మీరు ... మీ రెవరు? రామ్మూర్తి అమ్మగారా?" ఎటువంటి సమాధానం వినవలసి వస్తుందోనని భయపడుతూనే వుంది సీత.

"రామ్మూర్తి ఎవడు?" ప్రౌఢ ముఖం చిట్లించింది. "నిన్ను తీసుకొచ్చి నా కమ్మేసి వెళ్ళిన వెధవ నీతో ఆ విధంగా చెప్పుకున్నాడేమో! వాడి పేరు అదికాదమ్మాయ్! వరహాల్రావ్."

తను మరొకసారి మోసపోయినట్లు అర్థమైంది సీతకి. భూకంపం వస్తే బావుండు ననిపించింది ఆమెకు. తన గుండెలు ఆగిపోయినా చాలనుకుంది.

కాని, ఆమె అనుకున్నవేవీ జరగలేదు.

“అతను వరహాల్రావు కాదు... రామ్మూర్తిగారు” అరిచింది, అతను వరహాల్రావే అయివుంటాడని మనసు చెబుతున్నా.

“చూడమ్మాయ్...నీ పేరేమిటి? సీత అని చెప్పాడా వెధవ అదేనా నీ పేరు?”

అప్రయత్నంగా తలూపింది సీత అవునన్నట్లు.

“ఈ నెల్లూరులో వరహాల్రావ్ తీసుకొచ్చే నాసిరకం ముండల్ని కొంటున్నది ఈ రాఘవమ్మ ఒక్కతే. నువ్వు ఓపిగ్గా బేరాలు చేస్తావని, అదీ యిదీ చెప్పి ఎనిమిదివందలు తీసుకెళ్ళాడు. బాకీ ఎంత తొందరగా తీరుస్తావో చూస్తాను. రామ్మూర్తి ... సింగినాదం అంటూ కబుర్లు చెపుతూ కూర్చోవద్దు! లేచి స్నానం చెయ్! పగలు పాతిక బేరాలైనా చెయ్యకుంటే బాకీ ఆర్నెల్లకు కూడా తీర్చలేవు...” కెనేడియన్ ఇంజన్‌లా అరిచి, వచ్చినంత వేగంగా నిష్క్రమించింది రాఘవమ్మ.

రామ్మూర్తి... వరహాల్రావ్... నెత్తి బాదుకుంది సీత. చాలా ఆలస్యంగా తెల్సిందామెకు ... జాకెట్ లోపల వక్షోజాల మధ్య ఏదో వస్తువు వుందని.

ఏడుపు మాని ఆ వస్తువు తీసి చూసింది. ఏదో వుత్తరం గబగబ చదువుకుంది.

“సీతా,

నా పేరు రామ్మూర్తి కాదు వరహాల్రావ్. రామ్మూర్తి

అనే క్రైం రచయిత వున్నమాట నిజమే! అతని రచనలంటే నాకూ ఇష్టమే! కాని, నేను అతను కాదు. అదెమ్మ కంపెనీ వుంటున్న ఊర్లోని ట్రావెలర్స్ బంగ్లాలో నీతో నేను ఒక్క మాట అయినా నిజం చెప్పలేదు. నా వృత్తి ఏమిటో ఇప్పటికి నీకు అర్థమై వుంటుంది.

సీత అనే చెల్లెలు నాకు లేదు.

నన్ను క్షమించు సీతా! ఈ విధంగా బ్రతకటం తప్ప మరొక పని నాకు తెలియదు. ట్రావెలర్స్ బంగ్లాలో నువ్వు తాగిన పాలలో మత్తుమందు కలపబడిందని నీకు తెలియదు. నేను వూహించిన దానికంటే తొందరగా నువ్వు స్పృహకోల్పోయావు.

నువ్వు నా చెల్లెలని, సడెన్‌గా ఆరోగ్యం తిరగబెట్టిందని టాక్సీ డ్రైవర్‌కి చెప్పి, ఎలాగో నిన్ను నెల్లూర్ చేర్చాను.

ఆంధ్రదేశం నలుమూలలా వుంటున్న వేశ్యా గృహాలతో నాకు సంబంధాలు వున్నాయ్. నిన్ను నెల్లూర్‌లోని రాఘవమ్మ కంపెనీలో అమ్మేసి వెళ్తున్నాను. ఈ కంపెనీ ఓనర్ రాఘవమ్మే! మంచి మనిషి కాదు. డబ్బును తప్ప మరి దేన్నీ ప్రేమించదు.

గుట్టుగా రాఘవమ్మ చెప్పినట్టు విని, తొందరగా బాకీ తీర్చెయ్ సీతా! జీవితంలో మళ్ళీ మనం కల్సుకోక పోవచ్చు! కల్సుకోవాలని నేను కోరుకోవటమూ లేదు. నన్ను క్షమించవల్సిందిగా మరొకసారి కోరుకుంటున్నాను చెల్లాయ్.

—వరహాలరావ్"

ఉత్తరాన్ని అవతల పారేసి, గదిలోంచి బయటకి

నడిచింది సీత. ఇప్పుడు ఏడవటం లేదామె. ఏడ్చి ప్రయోజనం లేదని ఆమెకు తెల్సు. అది అనుభవం నేర్పిన పాఠం.

మెయిన్ హాల్లో తనవంటి యువతులే నలుగురైదుగురు కన్పించారు. ఎవరినీ పలకరించలేదు సీత. తలొంచుకుని పెరటి వైపు వెళ్ళింది—చన్నీళ్ళ స్నానం చెయ్యటానికి.

5

ఆ రోజు రాత్రి భోజనాల దగ్గర సీతని జులేకా అనే అమ్మాయి పలకరించింది. "నీ పేరేమిటి అక్కయ్యా?"

"సీత."

"నా పేరు జులేకా."

బదులు చెప్పలేదు సీత. అన్నం సహించకపోవడంతో తింటున్నట్టు నటిస్తోంది.

జులేకా తిరిగి మాట్లాడింది. "ఈ కొంప ఓనర్ రాఘవమ్మ లేదూ...అదొక సైతాన్."

ఈసారికూడా మాట్లాడలేదు సీత.

"అక్కయ్యా! నేను ఈ రాత్రే ఇక్కణ్ణించి పారిపోవాలనుకుంటున్నాను" గుసగుసలాడింది జులేకా.

"పారిపోతావా? రాఘవమ్మకి తెలిస్తే?" ఇహ వూరుకోలేకపోయింది సీత.

"తాట వలిపిస్తుంది..." నవ్వింది జులేకా.

భోజనాలు పూర్తయ్యాయి. ఆ రోజు కంచాలు తియ్యటం, వంటగది ఊడవటం జులేకావంతు. అమ్మాయిలందరూ భోజనాలు ముగించి లేచి వెళ్ళాక జులేకా తన డ్యూటీ ప్రారంభించింది.

ఆ రాత్రి రాఘవమ్మకి వందరూపాయలు సంపాదించి

పెట్టింది సీత. బాగా అలసిపోయి, తెల్లవారు ఝామున నిద్రకుపడింది. ఇంతలో జులేకా గదిలోకొచ్చింది— "అక్కయ్యా! మనం త్వరగా వెళ్ళిపోవాలి!" అంటూ.

"ఎక్కడికి?" మంచం మీద లేచి కూర్చుంది సీత, ఆవులిస్తూ.

"ముందు ఈ కొంపలోంచి బయటికి. మిగిలిన వివరాలు తర్వాత చెప్తాను. లే... లే..."

"రాఘవమ్మ..."

"నల్లమందు మత్తులో నిద్రపోతోంది. ఈ కొంపకి కాపలా వుండే రౌడీరంగడు నేనిచ్చిన పాలు తాగి పడి పోయాడు. ఆపాలల్లో నిద్రమాత్రలు కలిపాన్లే పది."

జులేకా ధైర్యానికి విస్తుపోయింది సీత.

ఇద్దరూ గదిలోంచి బయటపడ్డారు. అమ్మాయిలు సైతం ఎవరి గదుల్లో వారు నిద్రపోతుండటంతో స్మశానాన్ని గుర్తుకు తెప్పిస్తోంది రాఘవమ్మ ఇల్లు.

జులేకా వెనుకే పెరటి దారిగుండా రాఘవమ్మ ఇంట్లోంచి బయటికి పరుగెత్తింది సీత. పావుగంటలో వాళ్ళిద్దరూ రైల్వేస్టేషన్ చేరుకునేశారు— కట్టుబట్టలతో.

6

ఉదయం ఐదున్నర ప్రాంతంలో గూడూరులోని ఒక పెంకుటిల్లు ముందు రిక్షా దిగారు...జులేకా, సీత.

రిక్షావాలాకి చిల్లర జులేకా యిచ్చింది.

ఖాళీ రిక్షా వెనుదిరిగి వెళ్ళిపోయింది.

"ఇదే మా ఇల్లు అక్కయ్యా!" సీత చేయి పట్టుకుని పెంకుటింట్లోకి తీసుకెళ్ళింది జులేకా.

రెండు గదులు కలిగిన పెంకుటిల్లు అది. ముందు గదిలో

యిద్దరు అమ్మాయిలు చాపలమీద పడి గాఢంగా నిద్ర పోతున్నారు. బహుశా వాళ్ళిద్దరూ జులేకా చెల్లెళ్ళు అయి వుంటారని వూహించింది సీత. వెనుక గదిలో వయసు మళ్ళిన స్త్రీలిద్దరు నులక మంచాలపై పడుకొని గురక పెడుతున్నారు.

ఆ కొంపలో ఎక్కడగాని మహమ్మదీయ సంస్కృతి అనేది కన్పించటం లేదు. చివరికి గోడలకుకూడా హిందూ దేవతల కేలండర్లు వ్రేలాడుతున్నాయ్.

సీతని పెరట్లోకి తీసుకొచ్చింది జులేకా.

పెరట్లో బావి, ఎండిపోయిన మల్లెపందిరి, ఒక ప్రక్కగా బాత్రూం, మరుగుదొడ్డి వున్నాయి.

"అక్కయ్యా! స్నానం చెయ్. నేను వెళ్ళి టిఫిన్ ఏర్పాట్లు చేస్తాను..."

"మీ నాన్నగారు కన్పించరేం?" జులేకా మాటలకు అడ్డుపడింది సీత.

ఎవ్వరూ నవ్వలేనంత విచిత్రంగా నవ్వింది జులేకా. "నాకు తల్లికాని, తండ్రి లేడు, అక్కయ్యా! ఎక్కడైనా బ్రతికివున్నాడో, లేడో మా అమ్మకే తెలియదు..." కొన్ని క్షణాలు వూరుకుని, సీత చేతులు పట్టుకుందామె.

"అక్కయ్యా! నీవు నన్ను క్షమించాలి!" అంది అమాయకంగా.

"ఎందుకు? నువ్వు ఏం తప్పు చేశావని?" జులేకాని అమాయకురాలిగా వూహించుకుంది సీత.

"నా పేరు జులేకా కాదు. చంచల."

ఆశ్చర్యపోలేదు సీత. వ్యభిచార కొంపలు మారే అమ్మాయిలు ఊరికే పేరు మార్చుకుంటూవుంటారని ఆమె విని వున్నది.

"నీ పేరు చంచల అయితే నాతో జులేకా అని చెప్పావ్. అదేనా నీవు చేసిన తప్పు? అందుకేనా క్షమించమంటున్నావ్?" నవ్వుతూ అడిగింది సీత.

"కాదు. నిన్ను రాఘవమ్మ కంపెనీలోంచి మోసం చేసి తీసుకొచ్చాను. ఈ ఇల్లుకూడా రాఘవమ్మ కంపెనీ లాంటిదే."

అదిరిపడింది సీత.

7

వారం రోజులు గిర్రున తిరిగాయ్.

చంచల తల్లి పేరు పాపమ్మ అని, తను ఆ కొంపలో అడుగు పెట్టిన రోజే తెల్సుకుంది సీత. మిగిలిన యిద్దరు అమ్మాయిలు కూడా తనవంటి చరిత్రహీనురాళ్ళే. అమ్మాయిలు తక్కువ కావడంతో బేరాలు సరిగా రావడం లేదని, తల్లిని ఒప్పించి, నెల్లూర్‌లోని రాఘవమ్మ కంపెనీలో చేరింది చంచల. కనీసం ఇద్దరినైనా ఆకర్షించి మోసగించి తీసుకురావాలని చంచల ప్లాన్.

ఆమె అనుకున్నట్టు జరగలేదు.

సీత ఒక్కతే అమాయకురాలిగా కన్పించింది చంచలకి. వెంటనే విసిరింది వల. చాలా సులభంగా ఆ వలలో చిక్కుకుంది సీత.

ఈ వివరాలన్నీ చంచల ద్వారానే తెలిశాయి సీతకి. ఆమెకు తెలియని విషయం ఒక్కటే.

పాపమ్మ వెంట వుంటున్న ప్రౌఢ ఎవరు?

"సీతా!" అంటూ పెరట్లోకి ప్రవేశించింది పాపమ్మ...

ఆ సమయంలో సీత మల్లెపందిరి క్రింద చాప పరచుకుని నిద్రకుపక్రమిస్తోంది. పాపమ్మ కంఠం విన్పించిన

వెంటనే ఆమె నిద్ర సహం ఎగిరిపోయింది. పాపమ్మ ఆకారం కన్పించిన మరుక్షణంలో మిగిలింది కూడా పారిపోయింది.

"ఏమిటత్తయ్యా?" అంది భయపడుతూ.

చంచల తప్ప మిగిలిన అమ్మాయిలందరూ అలాగే పిలుస్తారు పాపమ్మని. పిలవాలి! లేకుంటే పాపమ్మ తను సారథ్య నామధేయురాలని నిరూపించటానికి సిద్ధపడుతుంది.

"చంచల మిగిలిన యిద్దరినీ తీసుకుని మార్నింగ్ షో ఆట...దాని పిండాకుడు...వెళ్ళింది! బేరాలు వస్తే నువ్వే చూడాలి తల్లీ! నిద్రపోతే ఎలా?"

"అలాగే! ఎవరైనా వస్తే లేపు. కళ్ళలో ఇసుక వున్నట్లు ఒకటే మంటగా వుందత్తయ్యా! కాసేపు నిద్రపోతాను..."

"ఒక్క రోజు నిద్ర మానేస్తే కొంప మునగదులే. బేరాలు మానితే తిండిలేక చస్తాం," పాపమ్మ స్వరం మారిపోయింది.

సీతనిద్ర మరొక దేశం చేరుకుంది.

చాపచుట్టి, అవతల పడేసింది సీత. కిక్కురు మనకుండా బావివైపు కదిలింది స్నానానికి.

ఆ సాయంత్రం ముస్తాబు చేసుకుంటున్న చంచల్ని అడిగింది సీత ఉండబట్టలేక, "చంచలా! మన ఇంట్లో వుంటున్న రత్తాలు ఎవరు?"

"మా పెద్దమ్మ" అని చంచల చకచకరకం లిప్‌స్టిక్ రాసుకోవటంలో మునిగింది.

ఆ రాత్రి బేరాలు చెయ్యలేకపోయింది సీత. నిద్రలేమి

నీరసం అధికం కావటంతో మన్నుతిన్న పాములా పెరట్లో చాప పరుచుకుని పడుకుంది.

రాత్రి ఎనిమిది గంటలు కాకమునుపే పాపమ్మ ఇంట్లో హడావుడి మొదలైంది. రకరకాల మొగవాళ్ళు వచ్చి వెళ్తున్నారు. అరుపులు, నవ్వులు, కేకలు, కీచులాటలు... అవన్నీ వింటున్న సీతకి సన్నగా తలనొప్పి మొదలైంది. క్షణాలమీద దాని వుధృత పెరిగింది.

"అమ్మాయ్..." అంటూ వచ్చింది పాపమ్మ. "అయ్యయ్యో! ఇదేమిటే... ఈ వేళప్పుడు పక్క మీదకు చేరావు?" పడుకునున్న సీతని చూస్తూ అరుపులు మొదలు పెట్టింది.

"నేను నిద్రపోవాలత్తయ్యా! లేకుంటే చచ్చి పోతాను."

"వెధవ కబుర్లు చెప్పక! తిండి లేకుంటే చస్తారుగాని, నిద్రకి మొహం వాచిపోయిన వాళ్ళను నేనెరుగను. లే... అవతల బేరాలు ఎదురుచూస్తున్నాయ్!"

"నీకు దండం పెడతానత్తయ్యా! నన్ను విసిగించకుండా వెళ్ళు..."

కాసేపు సీతని చూస్తూ నిలబడింది పాపమ్మ. "వెధవ ముండా! దొంగ వేషాలు వేస్తున్నావ్, లేచి బేరాలు చూస్తావా, లేదా?"

"రాను...రాను...రాను...నన్ను చంపినా సరే!" స్వరం పెంచింది సీత.

గిర్రున వెనుదిరిగి వెళ్ళిపోయింది పాపమ్మ. నిమిషం కూడా గడవక మునుపే రత్తాలు వచ్చింది పెరట్లోకి.

ముడుచుకుని పడుకొనున్న సీతకి తన తొడ ఎందుకో

మందుతున్నట్టుగా అనుమానం కల్గింది. చటుక్కున కళ్ళు తెరిచి చూసేసరికి ఆమెకు అపరకాళిలా దర్శనమిచ్చింది రత్తాలు.

“దొంగ ముండా! మహారాణిలా వచ్చి ఇక్కడ పడుకుంటే అక్కడ బేరాలు ఎవరు చూస్తారే...మీ అమ్మా?” సీత ఎడమ తొడమీద చర్మాన్ని చీరపైనే మెలిపెడుతూ బూతులు విసురుతోంది రత్తాలు.

“నేను... నేను నిద్రపోవాలి!” అరిచింది సీత రత్తాలు చేతిని వెనక్కు నెట్టెయ్యాలని చూస్తూ.

“ఛెళ్...” మంటూ సీత చెంప మీద ఓ దెబ్బ వేసింది రత్తాలు. “నిద్రపోతే కంచంలోకి కూడు ఎలా వస్తుందే? లేస్తావా, లేదా?”

రత్తాలు నరరూప రాక్షసి అని అర్థమైపోయింది సీతకి. చేసేది లేక లేచి వెళ్ళింది—లోలోపలే వెక్కి వెక్కి ఏడుస్తూ.

8

మూడు నెలలు కాలగర్భంలో కలిశాయి.

ఈ మూడు నెలల్లో పాపమ్మ ఇంట్లోంచి ఒక్కసారైనా బయటికి వెళ్ళలేదు సీత.

ఎప్పుడైనా సినిమాకు వెళ్ళాలనిపించినా, బలవంతంగా ఆ కోరికను చంపుకుంటూ వస్తోంది సీత. ప్రపంచమంటే మనుష్యులంటేనే అసహ్యం వేస్తోందామెకు. దానికి తోడు నిరంతరం ఆమెకు ఎస్కార్ట్ గార్డులా మెలుగుతోంది రత్తాలు.

పారిపోయే ప్రయత్నం కాదుకదా, చివరికి అటువంటి యోచనైనా చెయ్యటం లేదు సీత. అటువంటి ప్రయత్నం

చేసి వారం రోజుల క్రితం పట్టుబడిపోయిన ఒక అమ్మాయిని రత్తాలు ఏ విధంగా సన్మానించిందో ఇప్పటికీ గుర్తుంది సీతకి.

ఇంకా ఆ పిల్లకి ఒంటిపూట భోజనమే పెడుతోంది రత్తాలు. పట్టుబడిన రోజు ఆ పిల్లని నగ్నంగా చేసి, చేతులు రెండూ వెనక్కి విరిచి పాపమ్మ, చంచల పట్టుకున్నారు. ఎటువంటి బాధ కలిగినా అరవటానికి వీల్లేకుండా ఆ పిల్ల నోట్లో గుడ్డలు కుక్కింది రత్తాలు. అటు తర్వాత ప్రారంభించిందామె చిత్రహింస.

తల వెంట్రుకలు పది—ఇరవై ఒక్కసారిగా పట్టుకుని లాగటం, చన్మొనల్ని మెలిదిప్పటం, తొడలమీద కత్తిగాట్లు పెట్టి ఉప్పునీళ్ళు చల్లటం, సన్న సూదులు వేడిచేసి కడుపుమీద వాత వెయ్యటం. ఆ వేళ ఆ ఘోరాన్ని చూళ్ళేక కళ్ళు తిరిగి పడిపోయింది సీత.

ఒకందుకు మాత్రం సీత సంతోషించిందనే చెప్పొచ్చు. పారిపోవటానికి ప్రయత్నించి ఆదెమ్మ ఇంట్లో పట్టుబడిన అమ్మాయిల్ని ఆదెమ్మ తమ్ముడు ధనపతి ఇంతకంటే క్రూరంగా హింసించేవాడు.

ధనపతికంటే రత్తాలే నయం.

9

"వెయ్యిరూపాయలు తీసుకో అత్తయ్యా!"

"వీలుకాదు అల్లుడూ! ఆ పిల్లని నేను రెండువేలు పోసి కొన్నాను."

"ఏ ఊరు పిట్టేమిటి?"

"గుడివాడ. బందరు లడ్డూలా వుంటుంది. ఒక్క రాత్రిలో ఏభై బేరాలయినా చెయ్యగలదనుకో!"

"మావద్ద కెవరైనా వచ్చినపుడు మేమూ ఇలాగే

వున్నవి లేనివి చెబుతూంటాం. ఇహ నీ సంగతి నాకు తెలియందని ఏముంది? మూడు పదులు దాటిన ముండని కూడా ఇలాగే చెప్పి అమ్మాలని చూస్తావ్."

"అదేం మాట? నా సంగతి నీకు తెలియదా, అల్లుడూ?"

"తెల్సుగనుకనే వెతుక్కుంటూ వచ్చాను."

తర్వాత ఎటువంటి మాటలూ విన్పించలేదు పెరట్లో ముఖం కడుక్కుంటున్న సీతకి. ఒక గొంతు పాపమ్మదని తెలుస్తూనేవుంది. ఇంకొకటి మగగొంతు. ఆ కంఠం తనెక్కడో విన్నట్టు అన్పిస్తోంది. ఎవరై వుండొచ్చు? వరహాల్రావా?

గబగబ ముఖం కడుక్కుని పైటతో తుడుచుకుంది సీత. పాపమ్మ ఎవరినో అమ్మెయ్యాలని చూస్తోంది. పది రోజులుగా నళిని అనే అమ్మాయి బేరాలు సరిగ్గా చెయ్యకుండా గొడవచేస్తోంది. నళినిని అమ్మెయ్యాలని చూస్తున్నదేమో! పాపం నళిని...సీత హృదయం బరువెక్కింది. కళ్ళు తుడుచుకుని వంట గదిలోకి వచ్చింది. ముందు గదిలోంచి తిరిగి విన్పించిందా మగకంఠం.

"ఇదిగో—ఎనిమిది వందలు. మిగిలిన డబ్బు ఊరెళ్ళి మణియార్డరు ద్వారా పంపుతాను."

"విధవ కబుర్లు చెపుతావ్. ఆ రెండువందలూ ఏట్లో వేసినట్లే లెక్క."

"లేదత్తయ్యా! మొగుడు చచ్చిన ముండవి. నీ డబ్బు నాకెందుకు చెప్పు?"

"ఒరేయ్...నా మొగుడు బ్రతికే వున్నాడు."

"ఎక్కడున్నాడేమిటి?"

"అదే తెలియటం లేదు. ఎక్కడున్నా బతికే

వుంటాడు."

చంచలతో పాటు మిగిలిన ఇద్దరు అమ్మాయిలు, రత్తాలు వంటగదిలో కూర్చుని టిఫిన్ ఆరగిస్తున్నారు.

"ఏమిటే అలా నిలబడిపోయావ్? అలా కూర్చో" అంది రత్తాలు సీతని ఎగాదిగా చూస్తూ.

రత్తాలును గురించి పట్టించుకోలేదు సీత.

ముందుగదిలో పాపమ్మతో బేరాలు సాగిస్తున్న వెధవ ఎవడు?

వరహాలరావ్ అయివుంటాడా?

ఆ వెధవ అయితే తను వెళ్ళి కన్పించాలి! తన ముఖం కన్పించగానే వాడు ఎలా ఫీలవుతాడో చూడాలి!

టిఫిన్ సంగతి మర్చిపోయి విసురుగా ముందు గదిలోకి వచ్చింది సీత.

"అదిగో...వస్తోంది చూడు...ఆ పిల్లే! ఎలా వుంది అల్లుడూ...?" అంటోంది పాపమ్మ.

ఆ మాటలు విన్న సీతకి అమ్మేయ్యబడుతున్నది తనే అని క్లియర్‌గా అర్థమైంది. అయినా బాధ పళ్ళేదామె. వెళ్ళబోతున్న చోటనైనా కాస్త సుఖం వుంటుందేమోననే ఆశ!

తన్ను కొనుగోలు చేయడానికి వచ్చివున్న వ్యక్తిని చూసింది సీత.

అంతే, సీత కళ్ళు తిరిగాయ్. నిలబడలేక మెలికలు తిరుగుతూ నేలకొరిగిపోయింది. ఆమెకు బాహ్యా స్మృతి పోయింది.

సీతని కొనుక్కోవ్టానికి వచ్చివున్న వ్యక్తి వరహాల రావ్ కాదు. ఆదెమ్మ తమ్ముడు...ధనపతి!

-: ఐ పో యిం ది :-